ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :143 గురువారం మార్చి 19 2026, పేజీలు - 4 వెల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

రహీకంపేట గ్రామ ప్రజలందరికీ మరియు నా తోటి సోదర సోదరీమణులకు శ్రీ పరాభవ నామ సంవత్సర, ఉగాది పండుగ శుభాకాంక్షలు. ఈ కొత్త సంవత్సరం మీ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను, ఆయురారోగ్యాలను మరియు పాడిపంటలతో కూడిన ఐశ్వర్యాన్ని నింపాలని కోరుకుంటున్నాను.ప్రేమతో,మీ గ్రామ ఉపసర్పంచ్,రహీంఖాన్ పేట, ఇల్లంతకుంట మండలం.




## మన్రేగా పరిరక్షణ యాత్రలో వైఎస్ షర్మిల




### -భీమిలి నియోజకవర్గం కోరాడ గ్రామంలో రచ్చబండ
### -ప్రజల సమస్యలు విన్న కాంగ్రెస్ నేత
### -మన్రేగా చట్ట పునరుద్ధరణకు మద్దతు కోరింపు

విశాఖపట్నం, మార్చి 19 (మన ప్రజాప్రతినిధి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర విశాఖపట్నం జిల్లాలో కొనసాగింది. భీమిలి నియోజక వర్గంలోని కోరాడ గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు, కరువు పరిస్థితుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గ్రామస్తులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించగా, ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యాలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.రచ్చబండ వేదికగా ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కలిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని చట్టాల వల్ల ఉపాధి హామీ పథకానికి నష్టం కలగవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. మన్రేగా చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఈ పథకం పునరుద్ధరణకు ప్రజలు మద్దతు ఇవ్వాలని షర్మిల కోరారు. భీమిలి ప్రాంత ప్రజలు కూడా ఈ యాత్రకు మద్దతు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ప్రభుత్వ ప్రమేయం లేదు


### -స్టేషన్ బెయిల్ నిబంధనల మేరకే ఇచ్చారు
### -కేసు దర్యాప్తుకు ప్రత్యేక బృందం ఏర్పాటు
### -ఢిల్లీ పర్యటనలో మీడియాతో సీఎం స్పందన



ఢిల్లీ, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల ప్రకారం స్టేషన్ బెయిల్ ఇచ్చినట్టు తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రిగా తనకు ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్టు సీఎం వెల్లడించారు. చట్ట ప్రక్రియ ప్రకారమే ఈ కేసులో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీ పుట్టా మహేశ్‌కు కూడా నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ లభించిందని వివరించారు.రాజకీయ పరిస్థితులపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. 2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని ఆయన పేర్కొన్నారు. 2029లో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ముందుగానే అమల్లోకి వస్తే ఆనందిస్తామని తెలిపారు. ఇక ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కాంగ్రెస్ అగ్రనేతలను కలిశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో సమావేశమై రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సహా ఇతర నేతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలకు ముఖ్యమంత్రి పరిచయం చేశారు.

## టిడ్కో ఇళ్ల దరఖాస్తుదారులకు డబ్బులు తిరిగి

అమరావతి, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): గత ప్రభుత్వ కాలంలో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి ఫ్లాట్ కేటాయింపులు పొందని దరఖాస్తుదారులకు వారి సొమ్మును తిరిగి చెల్లించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 83,865 మంది దరఖాస్తుదారులకు సుమారు రూ.174 కోట్లను వెనక్కి ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందజేయాలని సీఎం సూచించారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయిన 1,00,875 టిడ్కో ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. లబ్ధిదారులు ఇళ్లలోకి త్వరగా ప్రవేశించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో పట్టణాభివృద్ధి శాఖపై సమీక్ష నిర్వహించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ ప్రక్రియపై అధికారులు వివరాలు సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో మంత్రి పీ నారాయణ, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, సీడీఎంఏ డైరెక్టర్ సంపత్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.



## శ్రీకాకుళంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న అచ్చెన్నాయుడు

### -మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య
### -ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.45 కోట్లు విడుదల
### -షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ



శ్రీకాకుళం, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ రోడ్డులో శశి కన్వెన్షన్ హాల్లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. స్థానిక శాసనసభ్యుడు గొండు శంకర్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొని ముస్లిం సోదరులతో సమావేశమయ్యారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాల కోసం ప్రభుత్వం రూ.45 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో త్వరలోనే షాదీఖానా నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే జామియా మసీదు అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు.ముస్లిం మైనారిటీలకు ప్రతి ఏడాది బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయిస్తూ విద్య, వైద్య రంగాల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా రంజాన్ తోఫా ఇవ్వాలనే ఆలోచన ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈసారి ఇవ్వలేకపోయామని తెలిపారు. భవిష్యత్తులో తిరిగి అందించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. పేద, బడుగు బలహీన ముస్లిం కుటుంబాలకు ఇళ్ల మంజూరు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొంటూ ముస్లిం సోదరులందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# యువత కోసం యువ మండల్ వికాస్ అభియాన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా డివైఓ వెంకట రాంబాబు

మన ప్రజాప్రతినిధి /మనకొండూరు తేదీ 18 మార్చ్ :గ్రామీణ యువతను ఏకం చేసివారిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా 'మై భారత్ రాజన్న సిరిసిల్ల, శ్రీకృష్ణ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అనంతరం గ్రామంలో "యువ మండల్ వికాస్ అభియాన్" కార్యక్రమాన్ని 5 రోజులలో 50 గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో యువజన నాయకులకు యూత్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా డివైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం అని తెలిపారు. ఇప్పటివరకు యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో నూతన. సంఘాలను ఏర్పాటు చేసి, వారిని 'మై భారత్ కరీంనగర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా విభాగాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుగ్గా పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో ఆర్గనైజర్ అక్కేం నాగరాజు,అనంతారం గ్రామ సర్పంచ్ ఒల్లల రజిత వెంకటేష్ ఉపసర్పంచ్ కదం జయంత్ వార్డ్ సభ్యులు అక్కేం ఉపేందర్ మల్యాల రాజశేఖర్ బట్టి క్రాంతి, శిలాపురం రమేష్,యువజన సంఘం సభ్యులు , బొల్లం శ్రీకాంత్, బండారి వెంకటేష్, గోనెపెల్లి వెంకటేష్, యువకులు తదితరులు పాల్గొన్నారు.




# జవహర్ నవోదయలో జిల్లా స్థాయిలో ర్యాంక్ సాధించిన గడ్డం కృతి ప్రీతిక రెడ్డి కు సన్మానం

మన ప్రజా ప్రతినిధి న్యూస్/సత్తుపల్లి నియోజకవర్గం: మంగళవారం ప్రకటిం చిన జవహర్ నవోదయ 6 వ తరగతి ప్రవేశ పరీక్షల ఫలితాలలో కల్లూరు ఎం.పి.పి.ఎస్ ప్రభుత్వ పాఠశాల నుంచి గడ్డం కృతి ప్రీతిక రెడ్డి జిల్లా స్థాయిలో ర్యాంక్ సాధించింది. ప్రతిష్టాత్మకమైన నవోదయ విద్యాలయం పాలేరు లో ప్రవేశం పొందడం ఎంతో గర్వకారణం. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ప్రవేటు పాఠశాలలకు ధీటుగా జిల్లా స్థాయిలో మంచి ర్యాంక్ సాధించిన ప్రీతిక మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత విద్యార్థిని సన్మానించి విద్యార్థికి, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో మంచి ఉన్నతస్థాయికి వెళ్లాలని, ఇలా విద్యార్థులను నవోదయ, గురుకుల, సైనిక్ ఎగ్జామ్స్ కు ప్రిపేర్ చేపిస్తున్న హెడ్ మాస్టర్ వరక రామారావు కి, రమాదేవి, మామిడాల.వెంకటేశ్వరావు, అనిత కుమారి, ఫణిశంకర్ రెడ్డి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడమాస్టర్ పద్మ, ఉపాధ్యాయులు విద్యార్థినికి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపి బహుమతి అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏ సందర్భంగా పాఠశాల హెచ్ ఎమ్ వరకా రామారావు కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన గురువులకు, తల్లి దండ్రులకి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ విద్యార్థిని ఆశీర్వధించారు



# పామాయిల్ ఫ్యాక్టరి నిర్మాణ పనులను పరిశీలించిన మట్టా దయానంద్

మన ప్రజా ప్రతినిధి న్యూస్ /సత్తుపల్లి నియోజకవర్గం:కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరి నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుంది అని తెలిపారు. సుమారు ఇప్పటి వరకు 60% పనులు పూర్తి కావస్తున్నాయి అని తెలిపారు. ఆధునిక నూతన మలేషియా టెక్నాలజీ తో నిర్మాణం జరుగుతుంది అని తెలిపారు. వేంసూరు మండల రైతులకు పంటలు ద్వారా ఎంతో ఆదాయం వస్తుంది అని తెలిపారు. వేంసూరు మండలంలో, కల్లూరుగూడెం ప్రాంత పరిసరాల్లో భూములు రేటు బాగా పెరిగాయని రైతులు సంతోషం గా వున్నారు అని తెలిపారు.పామాయిల్ ఫ్యాక్టరీ వలన ఏటువంటి కాలుష్యం జరగకుండా టెక్నాలజీ వాడాలి అని కాంట్రాక్టర్ కు సూచించారు. కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ వలన ఉద్యోగ అవకాశాలు, రోజువారి పనులు వేతనం దొరుకుతుందని తెలియజేశారు. అతి త్వరలో వేంసూరు మండలంకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందుతాయని వేంసూరు మండలం పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ రైతులందరూ తరపున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి బట్టి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు,సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు సోమిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గొర్ల సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు వెల్ది జగన్ మోహన్ రావు, గంగాధర్ రావు, కుక్కపల్లి శ్రీను, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ సంబంధిత అధికారులు, వేంసూరు మండల గ్రామ సర్పంచులు, రైతు సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించండ సిపిఐ సూచన

నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక): సీసీ రోడ్డు పోసి ఇరువైపులా మట్టి పోయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అలాగే పెరుగుతున్న కంపచెట్లు తక్షణమే తొలగించాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుదు ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. బుధవారం నాడు ఆయన నేరేడుచర్ల లోని వివిధ వార్డులలో ఉన్న సిసి రోడ్లను రోడ్డుకి ఇరువైపులా ఉన్న కంప చెట్లను సిపిఐ బృందంతో కలిసి పరిశీలించి న పిమ్మట ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఒకపక్క మంత్రి అంతర్గత రోడ్లకు వందలాది కోట రూపాయలు కేటాయిస్తున్నామని రోడ్లకు మహర్దశ వస్తుందని చెబుతున్నారని అందుకు అభినందనలు తెలియజేస్తున్నామని కానీ పట్టణంలోని అంతర్గత సిసి రోడ్ల పట్ల అలాగే మండలశీలో ఇటీవల కాలంలో వేసిన సిసి రోడ్లకు ఇరువైపులా మట్టి పోయడం లేదని ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగే పరిస్థితి లేదని ఇందుకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన ప్రశ్నించారు. పట్టణంలోని అనేక చికెన్ దుకాణాల ముందు వ్యర్థాలు పేరుకు పోతున్నాయని, వారు కనీసం డస్ట్ బిన్ ఉపయోగించకున్నా అడిగే నాధుడు లేడని, రోడ్డుకి ఇరువైపులా కంపచెట్లు పెరిగి రోడ్డు మీదికి వస్తున్నాయని అటుపక్క కంప చెట్లు ఇటుపక్క కంపచెట్టు పెరగడం వల్ల వాహనాలకు పంక్చర్లు అవుతున్నాయని, తక్షణమే వాటికి తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులు అప్రమత్తంగా ఉండకపోతే పాలకులు బదనాం అవుతారని ఇటీవల కాలంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు ఆయన వెంట మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చా లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ సిపిఐ నాయకుడు శీలం రాంబాబు ఉన్నారు



# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ లో పాల్గొన్న తాసిల్దార్ శివప్రసాద్, ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 18,:రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టణ జామ మస్జీద్ లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక తహసీల్దార్ శివప్రసాద్ , ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ ఏ ఎం సి చైర్మన్ వెంగల్ రావు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుకలలో ముస్లిం సోదరుల తో కలిసి ఇఫ్తార్ .చేయడం సంతోషకరంగా ఉందనిఅన్నారు,పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందుఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు.సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టినలముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి,ఉపవాస దీక్ష విడిపించారు.ఈ సందర్భంగా ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో సంతోషకరంగా ఉందని , రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు, అన్ని మతాలు చెప్పేది ఒకటేనని మనుషులంతా సమానమని, సమాజంలో సోదర భావంతో కలిగి ఉండాలన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ రఫీ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, , మార్కెట్ కమిటీ అధ్యక్షులు తాడేం వెంగలరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు,వార్డ్ మెంబెర్స్, కమిటీ అధ్యక్షులు షకీల్, రహీమోద్దీన్, ఇమామ్ అన్వర్, సాబేర్, అలీ,ఆరీఫ్, కాంగ్రెస్ సినియర్ నాయకులు పాల్గొన్నారు



# వాసవి కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

నేరేడుచర్ల మన ప్రజా ప్రతినిధి దినపత్రిక) శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ ఆధ్వర్యంలో "అమావాస్య "సందర్భంగా అన్నవితరణ" అన్నదాన" కార్యక్రమం ఘనంగా జరిగినది దాదాపు 600మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు ఈ అన్నదాన కార్యక్రమం దాతల సహాయ సహకారంతో జరుగుచున్నది దాదాపు17 నెలల నుండి జరుగుతున్నది కావున ఇట్టి కార్యక్రమమునకు దాతలఅందరికీ మరియు సేవలో పాల్గొన్న వారికి ప్రతి ఒక్కరికి పేరుపేరునా కమిటీ వారు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రాచకొండ శ్రీనివాసరావు. ఊట్కూరు నటరాజు. కందిబండ శ్రీనివాసరావు.పోలిశెట్టి వెంకటేశ్వర్లు. వుప్పలపుల్లయ్య.చెరుకు రాము .చారగుండ్ల వెంకటేశ్వర్లు. భువనగిరి అంజయ్య. గుండా సత్యనారాయణ. జూలూరు అశోక్ .తాళ్లూరి శ్రీనివాసు. జగిని సురేశ్. రాచకొండ అంజయ్య .చందా కిషన్. పాల్వాయి గోపాలకృష్ణ. గొళ్ళసైదయ్య. మాశేట్టి మోహన్ . ఓరుగంటి గణెశ్ .తడకమళ్ళ పరమేశం.వీరవెల్లి శ్రీనివాస్ . గరిణె వాసు. రాచకొండ శ్రీనివాస్ .బొడ్డు నాగేశ్వరరావు. చిట్టిపోలు కామేశ్వరరావు. గెల్లి లక్ష్మి నర్సంహ్మారావు .నిలా శ్రీనివాస్ . చెక్క లక్షణ్. గజ్జల నర్సింహ్మారావు .బొడ్డు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు




# రాజకీయాల్లో పదవీ విరమణ ఉండదు

న్యూఢిల్లీ, మార్చి 18, 2026 మనప్రజాప్రతినిధి:- రాజ్యసభ వీడ్కోలు సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు! రాజకీయ ప్రస్థానంలో పదవీ విరమణ అనేది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమేనని, ప్రజా సేవలో ఎప్పుడూ విరామం ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సభను వీడుతున్న వారు సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కృషిని నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో జరిగిన సుదీర్ఘ చర్చలు, విభిన్న అభిప్రాయాలు అన్నీ భారత ప్రజాస్వామ్య బలాన్ని చాటుతాయని ఆయన పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్క సభ్యుని అనుభవం ఎంతో విలువైనదని, ఆ అనుభవ పాఠాలు ఎన్నటికీ వృధా కావని మోదీ భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు.. హెచ్.డీ దేవెగౌడ, శరద్ పవార్, మల్లిఖార్జున ఖర్గే వంటి సీనియర్ నేతల నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. దశాబ్దాల కాలం పాటు పార్లమెంటరీ సేవలో గడిపిన వీరి జీవితాలు యువ నాయకులకు మార్గదర్శకాలని ఆయన కొనియాడారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తనదైన శైలిలో చమత్కరిస్తూ.. దేవెగౌడ గారితో తనకున్న 54 ఏళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు" అని ఖర్గే అనడంతో సభలో నవ్వులు పూశాయి. రాజకీయాల్లో ఉన్నవారు అలసిపోరని, దేశం కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటారని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో 26 మంది ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, మిగిలిన స్థానాలకు పోలింగ్ ద్వారా అభ్యర్థులు విజయం సాధించారు.



# మన్రేగా పరిరక్షణ యాత్రలో వైఎస్ షర్మిల

విశాఖపట్నం, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర విశాఖపట్నం జిల్లాలో కొనసాగింది. భీమిలి నియోజకవర్గంలోని కోరాడ గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు, కరువు పరిస్థితుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గ్రామస్తులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించగా, ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యాలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.రచ్చబండ వేదికగా ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కలిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని చట్టాల వల్ల ఉపాధి హామీ పథకానికి నష్టం కలగవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. మన్రేగా చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఈ పథకం పునరుద్ధరణకు ప్రజలు మద్దతు ఇవ్వాలని షర్మిల కోరారు. భీమిలి ప్రాంత ప్రజలు కూడా ఈ యాత్రకు మద్దతు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు.

# మెదక్ పట్టణంలో గృహ ఎల్ పిజి సిలిండర్ల అక్రమ వినియోగంపై దాడులు
## 52 సిలిండర్లు స్వాధీనం...




మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 18: మెదక్ పట్టణంలో గృహ వినియోగ ఎల్ పిజి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగిస్తున్నారనే సమాచారంతో జిల్లా సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు బృందాలు పాల్గొన్నాయి. టీమ్-1లో మొహద్ అబ్దుల్ నిసార్ (ఏసిఎస్ఓ ), పోలీస్ సిబ్బంది ఉన్నారు. టీమ్-2లో వెంకటేశం (డీసీపీ ), పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ బృందాలు మెదక్ పట్టణంలోని రెస్టారెంట్లు, టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు మరియు ఇతర వాణిజ్య దుకాణాలపై తనిఖీలు నిర్వహించగా, గృహ వినియోగ ఎల్ పి జి సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దుకాణ యజమానుల నుండి మొత్తం 52 గృహ వినియోగ ఎల్ పి జి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో భారత్ పెట్రోలియం కు చెందిన 47, హిందుస్తాన్ పెట్రోలియం కు చెందిన 3, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కు చెందిన 2 సిలిండర్లు ఉన్నాయి. స్వాధీనం చేసిన సిలిండర్లను భద్రపరిచేందుకు మెదక్‌లోని భారత్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. అక్రమ వినియోగంపై సంబంధిత దుకాణ యజమానులపై కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, గృహ వినియోగ ఎల్ పిజి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వెంగళరావు నగరంలో రూ.600 కోట్ల ప్రభుత్వ భూమి రక్షణ

- మూడు ఎకరాల భూమికి హైడ్రా ఫెన్సింగ్
- ఆక్రమణలపై కఠిన చర్యలు
- తప్పుడు పత్రాలతో కబ్జాలకు యత్నించిన పలువురు





హైదరాబాద్, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): నగరం నడిబొడ్డున ఖైరతాబాద్ మండలంలోని వెంగళరావు నగరంలో మూడు ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. మార్కెట్ విలువ సుమారు రూ.600 కోట్ల వరకు ఉండే ఈ భూమిపై కొనసాగుతున్న ఆక్రమణలను గుర్తించిన అధికారులు బుధవారం ప్రత్యేక చర్యలు చేపట్టి భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి అని సూచిస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. 1975 కంటే ముందే సంబంధిత వ్యక్తులకు పరిహారం చెల్లించి సుమారు 45 ఎకరాల భూమిని హౌసింగ్ బోర్డు సేకరించింది. ఆ భూమిపై 660 ప్లాట్లతో లేఔట్ ఏర్పాటు చేయడంతో పాటు పార్కులు, ప్రజావసరాల కోసం కొన్ని స్థలాలను కేటాయించింది. వెంగళరావు నగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఐదు ఎకరాల భూమిని ప్రజా అవసరాల కోసం ఖాళీగా ఉంచారు. అయితే ఇందులో ఇప్పటికే రెండు ఎకరాల వరకు ఆక్రమణలు జరిగి శాశ్వత నిర్మాణాలు ఏర్పడ్డాయి. మిగిలిన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిపై తాజాగా ఆక్రమణలు పెరగడంతో హైడ్రా రంగంలోకి దిగింది. హౌసింగ్ బోర్డు నుంచి గతంలో పరిహారం తీసుకున్న కొంతమంది వ్యక్తులతో పాటు మరో మూడు గ్రూపులు ఈ భూమి తమదేనని చెబుతూ ఆక్రమణలకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. ఈ భూమిపై హక్కు ఉందని చెబుతున్న వారందరితో హైడ్రా సమావేశం ఏర్పాటు చేసి వారి పత్రాలను పరిశీలించింది. అయితే ఎవరి వద్దా సరైన ఆధారాలు లేవని అధికారులు నిర్ధారించారు. ఇదే సమయంలో ఈ భూమి తమదేనని చెబుతున్న కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించారు. హైకోర్టు స్టే కొనసాగుతున్నప్పటికీ అక్కడ కొత్తగా గుడిసెలు వేయడం, షెడ్డులు నిర్మించడం, వివిధ వ్యాపారాలు నిర్వహించడం వంటి చర్యలు కొనసాగుతున్నట్లు స్థానికులు ఫిర్యాదులు చేశారు. మీడియాలో కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణలపై కథనాలు రావడంతో హైడ్రా అధికారులు బుధవారం ఆక్రమణలను తొలగించి మూడు ఎకరాల భూమిని రక్షించారు. భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా స్పష్టంగా గుర్తింపులు ఏర్పాటు చేశారు.

# ఉగాది సందర్భంగా నేతలకు మట్టి పాత్రల అందజేసిన ఉప ముఖ్యమంత్రి

- సంప్రదాయాలకు ప్రతీకగా ఉగాది కిట్
- మట్టి పాత్రలు వాడాలని పిలుపు
- కుల వృత్తులకు ప్రోత్సాహం అవసరం





హైదరాబాద్, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా శాసనసభ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలకు ఉగాది మట్టి పాత్రలను అందజేశారు. సంప్రదాయ పద్ధతుల్లో పండుగను జరుపుకోవాలని సందేశం ఇచ్చే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి, కుల వృత్తులను ప్రోత్సహించండి" అనే నినాదంతో ఈ ఉగాది కిట్‌ను అందజేశారు. ఇందులో ఉగాది పండుగకు ఉపయోగపడే మట్టి కుండ, గ్లాసులు, జగ్, బౌల్‌తో పాటు షడ్రుచులకు అవసరమైన మామిడి కాయలు, వేప పువ్వు, బెల్లం, చింతపండు, కారం వంటి పదార్థాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి మట్టి పాత్రల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణలో కూడా మట్టి పాత్రల వినియోగం మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో మట్టి పాత్రలకు ప్రత్యేక స్థానం ఉందని నాయకులు పేర్కొన్నారు. మట్టి పాత్రల వినియోగాన్ని పెంచడం ద్వారా కుల వృత్తులను ప్రోత్సహించవచ్చని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# వెలుగుమట్ల భూదాన్ భూములపై హైకోర్టు స్టేటస్ కో

- యథాస్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశాలు
- అసలైన లబ్ధిదారులను గుర్తించాలని సూచన
- ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి గృహం కల్పించాలని తీర్పు



ఖమ్మం, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలోని భూదాన్ భూముల వ్యవహారంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భూదాన్ భూములపై ప్రస్తుతం ఉన్న పరిస్థితిని అలాగే కొనసాగించాలని కోర్టు స్టేటస్ కో విధించింది. భూదాన్ భూముల విషయంలో అసలైన లబ్ధిదారులను గుర్తించాలని బాధితులు హైకోర్టును ఆశ్రయించారు.



నష్టపోయిన బాధితులందరికీ భూదాన్ భూముల్లో ఇళ్ల స్థలం మరియు గృహం మంజూరు చేయాలని వారు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును పరిశీలించిన హైకోర్టు 311 మంది మాత్రమే కాకుండా, అక్కడ ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపింది. అలాగే భూదాన్ భూములపై స్టేటస్ కో కొనసాగించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాహసీల్దార్‌లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు యథాస్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది.

# రైతు మహోత్సవంలో రైతులందరూ ఉత్సాహంగా పాల్గొనాలి కలెక్టర్

- నంగునూరులో నాలుగు రోజుల రైతు మహోత్సవం
- వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికరాల ప్రదర్శనలు
- శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలు





జనగామ, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట్ట గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మహోత్సవం 2026లో రైతులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రైతులను కోరారు. రైతులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్ మరియు అనుబంధ శాఖల అధికారులతో పాటు ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతు మహోత్సవం ఏర్పాట్లపై అధికారులు సమగ్రంగా పని చేయాలని ఆయన సూచించారు. రైతు మహోత్సవం కార్యక్రమానికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొనేలా రవాణా, సమాచారం మరియు ఇతర సౌకర్యాలను సమన్వయం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. తెలంగాణలో అతిపెద్ద పామ్ ఆయిల్ కర్మాగారం ప్రారంభోత్సవం, రైతు భరోసా నిధుల విడుదల వంటి కార్యక్రమాలతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికరాల ప్రదర్శనలు మరియు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అలాగే శాస్త్రవేత్తలతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, మార్కెటింగ్, ఉద్యానవన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాపవరం పుంత రోడ్డు పనులకు శ్రీకారం

- రూ.35 లక్షలతో రోడ్డు నిర్మాణం ప్రారంభం
- రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు
- పనులను పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): నిడదవోలు నియోజకవర్గంలోని పెరవలి మండలం కాపవరం గ్రామంలో చాలా ఏళ్లుగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న పుంత రోడ్డు సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.35 లక్షల నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ కాపవరం గ్రామంలో పర్యటించి జరుగుతున్న రోడ్డు పనులను స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే కంకరతో ప్రారంభమైన పనులను పరిశీలించిన ఆయన తదుపరి దశలో గ్రావెల్ వేసి రోడ్డు చదును చేసే పనులకు కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు. ఈ రోడ్డు లేకపోవడం వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి పేర్కొన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక శ్రద్ధతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు సులభంగా తమ వ్యవసాయ భూములకు చేరుకునేలా మారడంతో పాటు గ్రామ ప్రజల దైనందిన జీవనం కూడా మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఆయన తెలిపారు.



# పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- మంగళగిరిపెనుమాక మార్గంలో దివ్యాంగులతో సంభాషణ
- దివ్యాంగ శక్తి విధానం గౌరవాన్ని పెంచుతుందని వ్యాఖ్య
- సమగ్ర సమాజ నిర్మాణానికి ప్రభుత్వ కట్టుబాటు



మంగళగిరి, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి నుంచి పెనుమాక వరకు పల్లె వెలుగు బస్సులో సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణించారు. మంత్రి హోదాలో కాకుండా ప్రజల సమస్యలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో బస్సులో ప్రయాణిస్తూ దివ్యాంగులతో కలిసి కూర్చుని వారి అనుభవాలు, సమస్యలు, ఆశయాలను తెలుసుకున్నారు. ఈ ప్రయాణంలో కొందరు దివ్యాంగులు ఉద్యోగాలకు వెళ్తుండగా, మరికొందరు మార్కెట్‌కు లేదా తమ రోజువారీ పనుల కోసం ప్రయాణిస్తున్నారని ఆయన గమనించారు. ప్రయాణం సాగుతున్నంతసేపు వారితో జరిగిన సంభాషణలు ఎంతో నిజాయితీగా, హృదయాన్ని తాకేలా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడిగా చదువుతున్న ఒక యువకుడు చెప్పిన మాటలు తనను ఎంతో ప్రభావితం చేశాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. సాధారణ ప్రజలతో పోలిస్తే దివ్యాంగులు జీవన విధానాన్ని కొనసాగించేందుకు ఎక్కువ ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తుందని ఆర్థికవేత్త అమర్త్య సేన్ చెప్పిన భావనను ఆ యువకుడు ప్రస్తావించినట్లు ఆయన పేర్కొన్నారు. దివ్యాంగ శక్తి విధానం ఆ భారం తగ్గించడమే కాకుండా సమాజానికి, రాష్ట్రానికి సేవ చేసే అవకాశాన్ని కల్పిస్తుందని ఆ యువకుడు చెప్పినట్లు తెలిపారు. దివ్యాంగ శక్తి విధానం కేవలం రవాణా సౌకర్యాలకు మాత్రమే పరిమితం కాదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి దివ్యాంగుడు ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు గమ్యస్థానానికి ఎలా చేరుకుంటామన్న ఆందోళన లేకుండా గౌరవంతో జీవించే అవకాశాన్ని కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. సమగ్ర భారత నిర్మాణానికి కేంద్ర నాయకత్వం చూపుతున్న దిశలో రాష్ట్ర ప్రభుత్వం కూడా దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

# ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

-ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 24 వరకు అవకాశం
-వివిధ దశల్లో ఆలస్య రుసుముతో దరఖాస్తుల స్వీకరణ
-ఏప్రిల్ 11 నుంచి 13 వరకు దరఖాస్తుల్లో సవరణకు అవకాశం



అమరావతి, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈఏపీసెట్ రెండు వేల ఇరవై ఆరు పరీక్షకు సంబంధించిన దరఖాస్తు గడువును అధికారులు పొడిగించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు ఇది ఊరటనిచ్చే నిర్ణయంగా భావిస్తున్నారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల ఇరవై నాలుగు వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు సెట్ కన్వీనర్ మోహనరావు తెలిపారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలస్య రుసుముతో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. వెయ్యి రూపాయల ఆలస్య రుసుముతో మార్చి ఇరవై ఎనిమిది వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రెండు వేల రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ ఒకటో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. దీంతో ఇంకా దరఖాస్తు చేయని విద్యార్థులకు అదనపు సమయం లభించింది.అదేవిధంగా నాలుగు వేల రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ ఆరు వరకు, పది వేల రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ పది వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కన్వీనర్ వివరించారు. ఈ గడువులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తైన తర్వాత అప్లికేషన్ ఫారమ్‌లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. ఏప్రిల్ పదకొండు నుంచి పదమూడు వరకు అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు మరియు దరఖాస్తు ప్రక్రియ కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. గడువు పొడిగింపును ఉపయోగించుకుని విద్యార్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# హనుమకొండలో దారుణం తండ్రి,కుమార్తె సజీవదహనం

-కడిపికొండలో తెల్లవారుజామున ఘటన
-కుటుంబ కలహాలే కారణమని అనుమానం
-నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ




హనుమకొండ, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): హనుమకొండ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తండ్రి, కుమార్తె అనుమానాస్పద పరిస్థితుల్లో సజీవదహనమైన ఘటన కలకలం రేపింది. కాజీపేట మండలం కడిపికొండలోని రాజీవ్ గృహకల్పలో గురువారం తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతులను రాజశేఖర్ (54), ఆయన కుమార్తె రాజశ్రీ (24)గా గుర్తించారు. రాజశ్రీ భర్త ప్రవీణ్ ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే అతడు భార్య, మామపై డీజిల్ పోసి నిప్పంటించి ఉండవచ్చని భావిస్తున్నారు.రాజశ్రీకి ప్రవీణ్‌తో 2023లో వివాహం జరిగింది. వీరికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. కుటుంబంలో తరచూ వివాదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ బృందం సహాయంతో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలు సేకరించారు. నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి

# రంజాన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న కొండా సురేఖ

-వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమం
-ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి ఉపవాస విరమణ
-రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



వరంగల్, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. బుధవారం ఏ1 క్లాసిక్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి వారి ఉపవాసాన్ని విరమింపజేశారు. పవిత్ర రంజాన్ మాసం ఐక్యత, సహనం, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు.రంజాన్ సందర్భంగా ముస్లిం సమాజం ప్రార్థనలు, ఉపవాసాలు పాటిస్తూ ఆధ్యాత్మిక భావనతో గడుపుతుందని తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని కోరుకుంటూ ఆమె అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం సమాజ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరస్పర ఐక్యతతో పండుగలను జరుపుకోవడం సమాజానికి మంచిదని పలువురు అభిప్రాయపడ్డారు.

# పదవీ విరమణ చేసిన రాజ్యసభ సభ్యులతో ఉపరాష్ట్రపతి సమావేశం

- రాజ్యసభ మాజీ సభ్యులకు అభినందనలు
- ప్రధాని సహా పలువురు ప్రముఖులు హాజరు
- సభ్యుల సేవలను కొనియాడిన నాయకులు



న్యూఢిల్లీ, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): భారత ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ ఛైర్మన్ సి. పి. రాధాకృష్ణన్ పదవీ విరమణ చేసిన మరియు ఇటీవల పదవీ విరమణ చేసిన రాజ్యసభ సభ్యులతో బుధవారం సమావేశమయ్యారు. పార్లమెంట్‌లో వారు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ వారికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు మరియు ఇతర పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. రాజ్యసభలో సేవలు అందించిన సభ్యులను అభినందిస్తూ వారి కృషిని కొనియాడారు. రాజ్యసభ సభ్యులుగా పని చేసిన సమయంలో దేశాభివృద్ధి, ప్రజాసేవల కోసం వారు చేసిన కృషి ఎంతో విలువైనదని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి పార్లమెంట్ సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. పదవీ విరమణ చేసిన సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటూ పార్లమెంట్‌లో పనిచేసిన కాలాన్ని గుర్తుచేసుకున్నారు. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములైనందుకు గర్వంగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో విషాదం ఎస్ఐ భార్య ఆత్మహత్య

-గన్నేరు పప్పు తాగి తీవ్ర అస్వస్థత
-ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
-ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు



కరీంనగర్, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): కరీంనగర్ జిల్లా కేంద్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడ్డారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే కరీంనగర్ నగరంలోని హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్న దివ్య మంగళవారం ఇంట్లో గన్నేరు పప్పు నూరుకుని నీళ్లలో కలిపి తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొద్దిసేపటికే ఆమెకు తీవ్ర అస్వస్థత ఏర్పడటంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు.వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో బుధవారం ఆమె ప్రాణాలు కోల్పోయారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తీవ్ర కడుపునొప్పిని భరించలేకనే దివ్య ఈ చర్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# డ్రోన్ రంగంలో స్వావలంబనకు భారత్ భారీ ప్రణాళిక

న్యూఢిల్లీ, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): డ్రోన్ తయారీ రంగంలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం "మిషన్ డ్రోన్ శక్తి" పేరుతో భారీ ప్రణాళికను రూపొందిస్తోంది. ఐదేళ్ల కాలానికి సుమారు రూ.1600 కోట్ల నుంచి రూ.1800 కోట్ల వరకు వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు. డ్రోన్ సాంకేతికతలో స్వదేశీ పరిశోధన, తయారీ సామర్థ్యాలను పెంచడం ద్వారా ప్రపంచ స్థాయిలో భారత్‌ను ప్రముఖ కేంద్రంగా నిలపడం ఈ ప్రణాళిక లక్ష్యంగా ఉంది. ఈ పథకం కింద డ్రోన్లకు అవసరమైన కీలక భాగాలైన మోటార్లు, సెన్సర్లు, బ్యాటరీలు వంటి భాగాలను దేశంలోనే తయారు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ దేశీయ సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోనున్నారు. దీనివల్ల స్వదేశీ సాంకేతికతకు మరింత ఊతం లభించనుందని అధికారులు భావిస్తున్నారు. డ్రోన్ వినియోగాన్ని రక్షణ రంగంతో పాటు పౌర రంగంలో కూడా విస్తరించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. వ్యవసాయం, భద్రత, పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ, సరుకు రవాణా వంటి అనేక రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని పెంచే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చర్యలతో దేశంలో డ్రోన్ పరిశ్రమకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం డ్రోన్ తయారీ రంగానికి ప్రోత్సాహం ఇవ్వడానికి రూ.120 కోట్ల ఉత్పత్తి ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తోంది. ఇప్పుడు ప్రతిపాదించిన మిషన్ డ్రోన్ శక్తి ద్వారా చైనా నుంచి జరిగే దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు భారత్‌ను ప్రపంచ స్థాయి డ్రోన్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం

# గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదమా?

డెస్క్, మార్చి 18 (మనప్రజాప్రతినిధి): గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. గర్భధారణను నివారించేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగించే ఈ మాత్రలు శరీరంలోని హార్మోన్లను ప్రభావితం చేసి పనిచేస్తాయి. అయితే ఇవి నిజంగా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా అనే అంశంపై అనేక పరిశోధనలు జరిగాయి. అందులో కొన్ని విషయాలు స్పష్టమయ్యాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించే పరిశోధనా సంస్థల నివేదికల ప్రకారం గర్భనిరోధక మాత్రలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి కంబైన్డ్ మాత్రలు, ఇందులో ఈస్ట్రోజెన్ మరియు ప్రొజెస్టోజెన్ అనే రెండు హార్మోన్లు ఉంటాయి. మరొకటి మినీ మాత్రలు, ఇందులో కేవలం ప్రొజెస్టోజెన్ మాత్రమే ఉంటుంది. ఈ మాత్రలు మహిళల శరీరంలో హార్మోన్ల సమతుల్యతను మార్చి అండోత్పత్తిని నియంత్రించడం ద్వారా గర్భధారణను నివారించడంలో సహాయపడతాయి.పరిశోధనల ప్రకారం కంబైన్డ్ గర్భనిరోధక మాత్రలు తీసుకునే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొద్దిగా పెరిగే అవకాశం ఉందని సూచనలు ఉన్నాయి. అయితే ఈ